
ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 6 పుష్పం : 14-15 05-12-2002

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL : 6** **ISSUE : 06**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 21260


## అన్ని తప్పులకు మూలకారణం - తనువే తాను అనుకోవటం

మనస్సు+శరీరం=మనిషి. మనిషిలోనుండి చైతన్యం తప్పకొంటే మనిషే, జడప్రాయమౌతాడు. మనం నిద్రనుంచి లేచే సమయంలో ''దేహంనేను'' అనే తలంపు హృదయంనుండి అత్యంత వేగంగా మన సహస్త్రారాన్ని చేరుకొంటుంది. తరువాత ఆతలంపుకు పరివారములైన, ఇదినా ఇల్లు, ఈసంసార సభ్యులు నావాళ్లు అనే అభిమానం కల్పిస్తుంది. అంతేకాదు "ఈఅహంకారం అందానికి, లోకం ఒకటి ఉంది, దేవుడు ఒకడు ఉన్నాడు" అంటుంది. జ్ఞాని అనుకొంటాడు "నేను ఆత్మను, నాకు ఒక శరీరంఉంది" కాని అజ్ఞానిది దీనికి తలక్రిందుల వ్యాపారం. "నేను శరీరాన్ని నాకు ఒక ఆత్మ ఉంది" అనుకొంటాడు. ఈ అసత్యభ్రాంతి వల్లనే మోహం పుట్టి, దు:ఖ్ఖాలకుకారణమైన జన్మలు ఏర్పడుతున్నాయి. జన్మేద్వైతం, కర్మానుభవంలేకపోతే జన్మేరాదు. "లోకం అసుఖమయం జీవితం వృధామయం" అని చివరి జన్మలలో గురుబోధతోగాని ఆనిజం గ్రహించలేము, సత్యసాక్షాత్కారానికి తపించలేము. ఇంట్లో శవంఉంటే పురుగులు పట్టిఅపాయం కలుగుతుంది. శవాన్ని పారవేస్తే ఆరోగ్యంగా ఉంటాము. అలాగే శరీరం నేను అనే భావన అంటిపెట్టుకొని ఉన్నంతకాలం ప్రపంచంలోని బాధలు అన్ని మనలను పీక్కుతింటాయి.

ఈ సంచికలో...... **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


06-11-2002 జువ్వలపాలెం ........ 3
25-11-2002 ఆచంట ........ 11



**Visit us @ www.srinannagaru.com**




ఆవాసనలను, బంధాలను నిజవిచారణతో బస్మంచేస్తే, తక్షణం సాటిలేని ఆనందం కలుగుతుంది. చైతన్యం మీద మాత్రమే ఉంచవలసిన విశ్వాసాన్ని దృశ్యరూపాలైన శత్రు, మిత్రులపై ఉంచి మరలా వాటిమీద అసూయత, మోహం పెంచుకోవటం, యిలా ఎన్నో పొరపాట్ల మీద పొరపాట్లు చేస్తూ , పరమానందయ్యగారి శిష్యుడుగా సాధకుడు ఉంటున్నాడు. అలవాట్లతో కూడిన ఈపొరపాట్లు ఎన్నో సంస్కారాలను మూటకట్టుకొనేటట్లు చేసి, జననమరణ ప్రవాహంలో కొట్టుకొని పోయేలా చేస్తున్నాయి. మనకు శతకోటి తలంపులు రావచ్చును దానికి మూలం "దేహం నేను" అనే మొదటితలంపే, దాన్ని బ్రహ్మాభావనతో గెంటేస్తే ఆత్మగా ఉంటాము. అంటే "అవసరం వచ్చినప్పడు మనస్సును వాడుకొని, తరువాత దాన్ని పడకకుర్చీలో పడుకో బెట్టాలి" అదే ఉత్తమభక్తి అంటారు పెద్దలు. శ్మసానానికి వెళ్లేవరకూ మనంకాని దేహంతోనూ, మనస్సుతోనూ, తాదాప్యం పొందితే మనకు ఆనందం ఎలా సాధ్యమౌతుంది. "నేను ఎవడను?" అనే ప్రశ్న ప్రయోజనం దేహం నేనుకాను, చైతన్యాన్నే నేను అనే స్ఫురణ నిరంతరం కలిగించి మనస్సును సాక్షీభూతంగా ఉంచుతుంది. తరువాత అదీకాలిపోతుంది. మనం "ఊరక ఉండక , "ఊరుతూ ఉన్నాము. శ్రీనాన్నగారు అంటారు "దేహాభిమానాన్ని త్యాగంచెయ్యుటంకంటే త్యాగము ఏమీలేదు సైకిల్ స్టాండు వేసి ఎంతసేపు ఎంతగట్టిగా తొక్కినా, ఎక్కడ ఉన్న వాడు అక్కడే ఉంటాడు. అలాగే , నీసాధనలు అన్నీ దేహంచుట్టూ తిరుగుతున్నాయి. అలాకాకుండా మనస్సులో పవిత్రతను కాపాడుకొంటూఉంటే అన్నీ సవ్యంగా సాగిపోతూఉంటాయి. మనం హృదయంలోనే ఉన్నాము అనే విశ్వాసం కలిగేవరకూ ఆభవసుఖం కలుగదు. గుర్తింపులు కోరుకోకూడదు. దేహమే నేను అనే తలంపుకే అన్ని పాపపుతలంపులు వస్తాయి. అందుండి విడుదలే సాధన" అన్నారు. ఇకనుంచి అయినా ఈ సత్యాన్ని గట్టిగా నమ్మి ఆచరించి ఆభవసుఖాన్ని పొందాలి.

-సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం

Nannagaru

Namaskars. Much love and gratitude is felt for the guidance and Grace received. The peace and joy of the Silence is being tasted.

Until your return here as the form of this Grace, I will seek the source of Silence through inquiry into the *illusion of jiva*.

Knowing this Grace will never depart, I pray for single-pointed strength of mind so *vairagya* and *dhyana* underlie all my thoughts and actions.

Is it better than praying for me to simply trust that all is good?

In abiding love and devotion,

**Bodhi Sun, U.S.A.,**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 6-11-02, జువ్వలపాలెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ధనం అంటే రూపాయికాగితాలే  ధనంకాదు, ఒక మంచిమాటకూడా ధనమే, మంచిమాట అనేకమందికి శాంతిని కలుగజేస్తుంది. మంచిపని కూడా ధనమే, మంచి పని పదిమందికి ఉపయోగపడుతుంది. అందుచేత మనం ఏమి మాట్లాడుతున్నాము, ఎలా మాట్లాడుతున్నాము, ఏపని చేస్తున్నాము అది ఎందుకు చేస్తున్నాము, మనం ఎలా జీవిస్తున్నాము అని చూసుకోవాలి. ధనాన్ని నిగ్రహించుకోవాలి. ధనాన్ని నిగ్రహించుకొంటే మనం అభివృద్ధిలోనికి వస్తాము, నిగ్రహించుకోలేకపోతే మనకు ఉన్న ధనమే మనలను పతనంచేస్తుంది. ధనం వలన మంచి పనులు చేస్తే పుణ్యం వస్తుంది. ఆ పుణ్యం జ్ఞానం సంపాదించటానికి సహకారంచేస్తుంది. ధనం వచ్చిందని మనం వినయం వదిలేస్తే ఆధనం పోవటమే కాదు, మరణానంతర జీవితంలో మనకు చీకటిలోకాలు మిగులుతాయి. జ్ఞానమే నిజమైనధనం రామకృష్ణపరమహంస గారికి బాహ్యంగా చూస్తే ఆయన దగ్గర ధనం ఏమీలేదు కాని ఆత్మజ్ఞానమే ఆయనధనం. ఆత్మజ్ఞానానికి మించిన సుఖంగాని, శాంతిగాని, ఆనందంగాని లేదు. అన్నం తినటంకంటే జీర్ణంచేసుకోవటం కష్టం, పుస్తకం చదవటం కంటే దానిని అర్థంచేసుకోవటం కష్టం అలాగే డబ్బును సంపాదించటం కంటే దానిని సద్వినియోగం చేయటంకష్టం. నువ్వు ఇతరులకు ఉపయోగించిన ధనం అంతా భవిష్యత్‌లో నీకే వచ్చేస్తుంది అని ఉపనిషత్‌లలో చెప్పారు. నీవు ఏదైనా ఒక ఉపాధికి సహాయం చేస్తున్నావు అనుకో ఆ ఉపాధి కూడా నీదే అనుకొని చెయ్యి అప్పడు మంచిపని చేసినట్లు అవుతుంది, నీకు గర్వంరాదు. మన దేహాన్ని దేవాలయంక్రింద చేసుకొంటే మన హృదయంలో ఉన్న భగవంతుడు మనకు దర్శనమిస్తాడు, స్వరూపంగామనకు వ్యక్తమవుతాడు.

మీ సాధనను పూజగదికి పరిమితం చేయవద్దు. ప్రతీక్షణం కూడా బహుజాగ్రత్తగా, మెలకువతో జీవించాలి. శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం మంచిదేకాని అక్కడితో సరిపెట్టుకోవద్దు, వాటిసహాయంతో ఆత్మజ్ఞానం సంపాదించాలి. దేనిని తెలుసుకొన్నాక ఇంక తెలుసుకోవటానికి ఏమీ మిగలదో, దేనిని తెలుసుకొన్నాక నీకు బ్రహ్మానుభవం కలుగుతుందో దానిని తెలుసుకో, దానిని సాధించు అని భగవంతుడు చెపుతున్నాడు.



మనం ఏవస్తువును తెలుసుకోవాలి అనుకొంటున్నామో దానిపట్ల, ఆగమ్యం పట్ల మనకు ప్రేమ ఉండాలి, దానిని చేరుకోవాలనే కాంక్ష ఉండాలి. అటువైపు ప్రయాణం చేసేటప్పడు మనకు ఏ తలంపులు అడ్డు వస్తున్నాయి, ఏ ఆలోచనలు అడ్డువస్తున్నాయి. అని పరిశీలన చేసి చూసుకొని వాటిని తీసి ఒక ప్రక్కన పెట్టాలి, అదే సాధన. మనకు ఎటువంటి తలంపులు వస్తే అటువంటి పనులే చేస్తాము. ఎటువంటి పనులు చేస్తూఉంటే అటువంటి తలంపులే మరల వస్తాయి. ఇలా చేస్తూ ఉంటే కర్మ చక్రంలోనుంచి విడుదల పొందలేము అని శాస్త్రం చెపుతోంది. మనకు ఏదైనా చెడుతలంపు వస్తే దానిని పనిలో పెడితే అది పెరిగిపోతుంది, అది బలపడిపోతుంది. ఆ చెడుతలంపును అక్కడే ఆపుచేసావు అనుకో అది నెమ్మదిగా బలహీనమైపోతుంది. తలంపుల విషయంలో, మాటల విషయంలో, అలవాట్ల విషయంలో, తినే ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, ఆధ్యాత్మికజీవితంలో ఇది అంతా ఒక భాగమే. మాకు జ్ఞాపకశక్తి తక్కువగా ఉంటోంది అని చాలా మంది అడుగుతున్నారు. జ్ఞాపకశక్తి పెరగటానికి ఒక ఉపాయం ఉంది. మనకు పనికిరాని విషయాలు ఎక్కువగా జ్ఞాపకం వస్తూఉంటాయి, ముందు వాటిని మర్చిపోవాలి, అవి జ్ఞాపకం వస్తూ ఉంటే మనం పతన మవుతాము. మనం మర్చిపోవలసిన విషయాలను నూటికి నూరుపాళ్లు మర్చిపోతే ఏ విషయాలయితే మనకు జ్ఞాపకం ఉండాలనుకొంటున్నామో వాటికి మరుపు రాదు, అవి  నిరంతరం జ్ఞాపకం ఉంటాయి. మనకు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మనకు ఈ తలంపు ఎక్కువ వస్తోంది, ఇది మనకు ఉపయోగపడదు అనుకొన్నప్పడు దానిని పూర్తిగా వదిలివేయాలి ఎలా వదిలి వేయాలి అంటే రోడ్డుపక్కన మీరు ఉమ్మివేస్తే దాని గురించి మరల మీకు తలంపు ఎలా రాదో అలాగ మీకు వచ్చే చెడుతలంపులను వదిలివెయ్యాలి. మీరు పరిశీలన చేసుకొంటే మీకు పనికిరాని తలంపులు ఎక్కువగా వస్తూఉంటాయి. వాటిని మర్చిపోతే మీకు పనికి వచ్చేవి అన్నీజ్ఞాపకం వస్తాయి. వివేకం విడిచి పెట్టకూడదు. ఏది ఆత్మ  ఏది అనాత్మ, ఏది సత్యం ఏది అసత్యం, మనగమ్యం ఏమిటి అని విచారణ అవసరం. భగవంతుడు అనే వాడు ఒకడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే భగవదనుభవం కలుగుతుంది. మనకు విశ్వాసం ఉంది కాని ఉండవలసినంత లేదు. బాగా డబ్బుఉన్నవారికంటే, కీర్తి ఉన్నవారి  కంటే, అధికారం ఉన్నవారికంటే ఎవరు శాంతిగ ఉంటారు అంటే భగవంతుడి సంకల్పం మీద ఎవరికైతే పరిపూర్ణమైన విశ్వాసం ఉందో వారు శాంతిగా ఆనందంగా ఉంటారు మనం ఇతరులను విమర్శించటం కాదు, మనలను మనం విమర్శించుకోవాలి ఇతరులను విమర్శించటం

వలన మనం పాడైపోతాము. మనలను మనం విమర్శించుకోవటం వలన వివేకం పెరుగుతుంది, ఆధ్యాత్మికస్థాయి పెరుగుతుంది, హృదయంయొక్క లోతులు పెరుగుతాయి. మన వాక్కు నిర్మలంగా ఉండాలి. ఆలోచన నిర్మలంగా ఉండాలి. పని కూడా నిర్మలంగా ఉండాలి ఈ భూమి మీదకు వచ్చి వెళ్ళిపోయిన జాడకూడా తెలియకుండా, గుర్తింపులు కోరుకోకుండా మన పని మనం చేసుకొని వెళ్ళిపోవాలి. మన హృదయంలో ఏముందో మనకు అక్కరలేదు. మనకు రంగు, పేరు తప్పించి ఏమీ అక్కరలేదు అంతకంటె లోతులలోనికి వెళ్ళలేక పోతున్నాము. తానుకాని దేహంతో, పేరుతో, మనస్సుతో, జనన మరణాలతో ఎవడైతే తాదాప్యం పొందుతున్నాడో వాడిని ప్రతీజన్మలోను కూడా భయం వెంటాడుతుంది. కొంతమందికి ఎప్పుడూ నెగిటివ్‌తింకింగ్ తప్ప పాజిటివ తింకింగ్ ఉండదు. నెగిటివ్‌తింకింగ్ ఉన్నవారు ఆరోజుకారోజు, ఆజన్మకు ఆజన్మ పతనమైపోతారు.

మమ్మల్ని ఏ మార్గంలో ప్రయాణం చేయమంటారు అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. మీ పూర్వపుజన్మ సంస్కారమును బట్టి మీకు ఏమార్గం ఇష్టమైతే ఆమార్గంలోనే ప్రయాణంచేసి భగవంతుడిని పొందండి, అనుకరణవద్దు, అనుకరణ పిరికివాడి లక్షణం. భక్తుడు దేనిని శరణాగతి అంటాడో, జ్ఞాని దానిని జ్ఞానం అంటాడు. శరణాగతి జ్ఞానంతోసమానము. పూర్ణశరణాగతి వలన కూడా దేహము నేను అనే తలంపు నశిస్తుంది, శవబుద్ధి నశిస్తుంది, శివబుద్ధి కలుగుతుంది. మూలతలంపు మూలంలోనే భగవంతుడు ఉన్నాడు. మనం మూలతలంపు యొక్క మూలాన్ని దర్శిస్తే మనకు భగవదనుభవం కలుగుతుంది. హృదయంలో ఉన్న సత్యవస్తువు మీద ఎవరికి ప్రేమలేదు, అసలు శ్రవణంలేదు. ప్రతీవాడు దేహంచుట్టూ తిరుగుతాడు, లోకంచుట్టూ తిరుగుతాడు. ఇవి రెండూ వాడు కాకపోయినా స్మశానానికి వెళ్ళే వరకు వీటిచుట్టూ తిరుగుతూ ఉంటాడు. హృదయంలో ఏ వాసుదేవుడు అయితే అంతర్యామిగా ఉన్నాడో వాడి వైపుకు నీ మనస్సు తిరగటంలేదు, నీ మనస్సు అటు జరగటంలేదు ఇంక నీవు ఏమి సాధిస్తావు. దేహమునేను అని దేహం అనటంలేదు. దేహానికి నేను అనే తలంపు ఉంటే ఎవడూ స్మశానానికి వెళ్ళడు. ఈ శవాన్ని కాల్చకుండా రోడ్డు ప్రక్కన పడవేస్తే కుక్కలు, నక్కలు, గెద్దలు నదిలో పడవేస్తే చేపలు తింటాయి. ఇటువంటి దేహాన్ని నేను అని దానినిపట్టుకొని తిరుగుతున్నావు ఇంకనీకు జ్ఞానం ఏమిటి? దారిద్ర్యాన్ని భరించటంకంటే అజ్ఞానాన్ని భరించటం కష్టం అన్నారు భగవాన్. మనకు ఎప్పుడైనా సఫరింగ్ వస్తే దేనివలన మనకు ఈ సఫరింగ్ వచ్చింది అని విచారణ చేసుకొంటే ఒక్కసారి మన మనస్సును లోపలకు త్రిప్పకొంటే మనకే తెలుస్తుంది. లోపలఉన్న



వస్తువు నీమాటకు, మనస్సుకు, సంకల్పానికి అందకపోయినా అది నీ అనుభవానికి అందుతుంది.

కొంతమంది జపంచేయరు, ధ్యానంచేయరు, విచారణచేయరు నిరంతరం జరిగి పోయిన గొడవలు తలపెట్టుకొంటూ ఉంటారు. దీనివలన వర్తమానకాలం చెడిపోతుంది. ఉన్నది వర్తమానకాలం ఒక్కటే భూతకాలం, భవిష్యత్‌కాలం ఈ రెండూ ఒకప్పుడు వర్తమాన కాలమే. అందుచేత నీవు వర్తమానకాలాన్ని విడిచిపెట్టవద్దు. మూలతలంపు చైతన్యంలో నుండే వచ్చింది. నీవు భక్తిమార్గంలో వెళ్ళినా, కర్మమార్గంలో వెళ్ళినా, విచారణామార్గంలో వెళ్ళినా మూలతలంపు మూలంలోనికి వెళ్ళాలి. సత్కర్మ విడిచిపెట్టవద్దు, చేసేది ఆసక్తి రహితంగాచెయ్యి. మనం ఏమిచేస్తున్నాము అంటే దేనినైతే పోగొట్టుకోవాలో నిరంతరం దానినే పొగుడుకోవటం, దేనినైతే పొందాలో దానిని పూర్తిగా విడిచిపెట్టేయటం జీవితం పొడుగునా ఈ రెండు పనులే చేస్తున్నాము. ఇతరులను పరిశీలించటంకాదు, మిమ్మల్ని మీరు పరిశీలించుకొంటే మీకు చాలా ఉద్రేకాలు తగ్గుతాయి ఎవరైనా అభివృద్ధిలోనికి వస్తూఉంటే మనం అసూయపడితే వారి అభివృద్ధి ఆగిపోదు, మనం పాడైపోతాము ఎందుచేతనంటే వాడి దేహప్రారబ్దాన్ని బట్టి ఈశ్వరుడు నియమిస్తూ ఉంటాడు, మన అసూయ వాడి అభివృద్దిని ఎక్కడ ఆపుచేస్తుంది. నీ హృదయంలో ఉన్న భగవంతుడు వాడి హృదయంలో కూడా ఉన్నాడు వాడిని చూసి అసూయ పడుతున్నావు అంటే ఈశ్వరుడిని చూసి అసూయ పడుతున్నట్లే. ఇవి అన్నీ నీకు బేదబుద్ధి వలన వస్తున్నాయి. మేము గంటల తరబడి ధ్యానం చేస్తున్నాము, సాధన చేస్తున్నాము అని చాలామంది చెపుతూ ఉంటారు. నీవు చేసేసాధన నిజమైతే హృదయంలోనికి ఎందుకు వెళ్ళలేకపోతున్నావు. మనం మాట్లాడే మాటలు యాంత్రికం, చేసే ధ్యానాలు యాంత్రికం, కొట్టే గంటలు యాంత్రికం మనం టాక్టును ఉపయోగించి సమాజాన్ని మోసం చెయ్యగలము కాని భగవంతుడిని మోసంచెయ్యలేము. నీ మనస్సును మూలం వైపు త్రిప్పటంలేదు లోకం వైపుకు త్రిప్పతున్నావు. అసలు చాలామందికి లోచూపులేదు. జ్ఞానం మాటవదిలి వేయండి ఒక మంచి మాటను ఆస్వాదించేవారు చాలా తక్కువమంది ఉన్నారు. ఆమాటను ఎంజాయ్ చేస్తేకదా అది నీకు అనుభవంలోనికి వచ్చేది. మనకు మోక్షం ఇచ్చేది లోకంకాదు, సర్వేశ్వరుడు. ఆచార్యులు వారు ఏమి చెప్పారు అంటే మసక చీకటిలో తాడు నీకు పాము క్రింద కనిపిస్తుంది. తాడును పాము అనుకోవటం వలన భయం కలుగుతుంది, మొత్తం అన్ని వికారాలు నీకు వచ్చేస్తాయి. అలాగే నీవు అజ్ఞానంలో ఉన్నప్పడు బ్రహ్మమే నీకు లోకంగా కనిపిస్తుంది. తాడు యందు

పామును ఎలా ఆరోపిస్తున్నావో అలాగే బ్రహ్మంనందు లోకాన్ని ఆరోపించుకొంటున్నావు. అక్కడ వెలుగు వస్తే ఏమీలేదు. ఇది పాము కాదు ఇది తాడే అని వెలుగువలన నీకు ఎలాతెలుస్తుందో అలాగే జ్ఞానం కలిగినప్పుడు ఈ లోకం ఏమీ లేదు అంతా బ్రహ్మంగానే నీకు కనబడుతుంది. ఇంతకాలం కనబడిన లోకం ఎక్కడకు వెళ్ళింది? వెలుగు వచ్చాక తాడు యందు పాము కల్పించబడింది అని నీకు ఎలా అర్థమవుతుందో అలాగే బ్రహ్మానుభవం కలిగాక బ్రహ్మంనందు లోకం కల్పించబడింది అని నీకు తెలుస్తుంది. ఉన్నది ఒక్కటే, ఉన్నది ఈశ్వరుడే ఎవరైనా మిమ్మల్ని స్తోత్రం చేసినా ఈశ్వరుడే, ఎవరైనా విమర్శించినా ఈశ్వరుడే ఎందుచేతనంటే వాడుతప్పించి ఇంకొకడు లేడు. వాడిచేతిలో మనందరం బొమ్మలం. ఈశ్వరుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం ఉన్నవారికి రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి. సూరమ్మగారు మిమ్మల్ని తిడుతున్నారు అని వారితో అంటే అక్కడ తిట్టటానికి ఎవరు ఉన్నారు, ఉన్నది ఈశ్వరుడే కదా అంటారు. సూరమ్మగారు తిట్టటంలేదు, ఆవిడ నోరును ఈశ్వరుడు ఉపయోగించుకున్నాడు, ఎందుకు ఉపయోగించుకొన్నాడు అంటే నీ చైతన్యస్థాయిని పెంచటంకోసం ఉపయోగించుకొన్నాడు.

దేహాభిమానాన్ని పెంచే తలంపును ధ్వసంచేయటానికి ప్రయత్నం చెయ్యి, అదే సాధన, నీ మాట దేహబుద్ధిని పెంచకూడదు, నీచేత దేహబుద్దిని పెంచకూడదు, మనం ఏదైనా మంచి పని చేస్తే ప్రక్కవారికి తెలియాలి అనుకోకూడదు నీ ప్రక్కవారు నీకు మోక్షాన్ని ఇవ్వరు, నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడే నీకు మోక్షాన్ని ఇస్తాడు. నీదేహప్రారబ్దాన్ని బట్టి నీవు అనుకొన్న పనులు అన్నీ అయిపోతున్నాయి అనుకో అలా అని వినయాన్ని పోగొట్టుకోవద్దు. వినయం, వివేకం ఇవి రెండూ నీజీవితం పొడుగునా కాపాడుకో. నీకు నేత్రాలు ఎంత ముఖ్యమో నీ జీవితాన్ని గైడ్‌చేయటానికి ఈ రెండూ కూడా అంతే ముఖ్యం, నీవు సాధన ఎంత చేయగలిగితే అంత చెయ్యి, నిరుత్సాహ పడవద్దు. సత్సంగాలవలన, సత్పురుషుల సహవాసం వలన, భగవంతుడితో మానసిక అనుబంధంవలన ఇప్పుడు దేహమునేను అని ఎలా అనుకొంటున్నావో, అలాగ లోపలఉన్న చైతన్యమే నేను అనే భావన పెరుగుతోంది అనుకో, ఇప్పుడు నేను భక్తుల దగ్గర కూర్చొన్నాను భక్తుల సమక్షంలో నేను ఉన్నాను అని వారి యొక్క ప్రెజన్స్ ఎలా ఫీలవుతున్నానో అలాగ భగవంతుడియొక్క ప్రెజెన్స్ అంత సజీవంగా ఫీలవుతూ ఉంటే ఈ జన్మలోనే నాకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. తోటి మానవుడికి ఎంతో కొంత ఉపయోగపడాలి అనే బుద్ధిరావటం అన్నింటికంటే కష్టం. ఈశ్వరుని దయనీకు లేకపోతే ఇతరులకు సహాయసహకారములు చేయాలనే బుద్ధికూడా నీకు కలుగదు. మీ



భక్తి వ్యాపారధోరణిలో ఉండకూడదు. మీరు చేసేపని నిరహంకారముగా, నిరాడంబరంగా, నిర్మలంగా, నిశ్చలంగా మీ ప్రక్కవాడికి కూడా తెలియకుండా ప్రశాంతంగా చేసుకుంటూ వెళ్ళండి వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. మీ ప్రారబ్దంలో ఉన్నది పోదు లేనిది రాదు ఇది ఈశ్వరుని నియమం. అహంకార ప్రేరితంగా ఒక్క మాట వచ్చిందా దేహబుద్ది పెరిగిపోతుంది. ఎవరికి ఉపయోగపడకుండా నీ శరీరం చనిపోయింది అనుకో చెట్లకు, నీకు తేడా ఏముంది అన్నాడు వివేకానంద.

భగవాన్ దగ్గరకు చిన్ననాటిస్నేహితులు వచ్చి మనం కలిసి చిన్నప్పుడు ఆటలు ఆడుకొనేవాళ్ళము, బడికి వెళ్ళేవాళ్ళము అని చిన్ననాటి మాటలు చెప్పేవారు. అప్పుడు భగవాన్ అనే వారు మీరు ఎరుగున్న వెంకట్రామన్ ఇప్పుడు ఇక్కడలేడు, ఇక్కడ ఉన్నవాడు ఎవడో మీకు తెలియదు, నేను చెప్పినా మీకు అర్థంకాదు అనేవారు. ఇక్కడ ఉన్నవాడు ఆత్మవారితో ఆడుకొన్న వాడు జీవుడు. జీవుడు ఉన్నచోట దేవుడు లేడు, దేవుడు ఉన్నచోట జీవుడు లేడు. జ్ఞానం ఉన్నచోట అజ్ఞానం లేదు, అజ్ఞానం ఉన్నచోట జ్ఞానం లేదు, మీరు ఎరుగున్న వెంకట్రామన్ ఇప్పుడు లేడు, ఏనాడో చనిపోయాడు అంటే ఆ జీవలక్షణాలు ఉన్నవాడు ఎప్పుడో పోయాడు అనిఅర్థం. ఒక జ్ఞాని మాత్రమే ఇంకో జ్ఞానిని అర్థం చేసుకోవాలిగాని, ఒక అజ్ఞాని జ్ఞానిని అర్థం చేసుకోలేడు ఒక వేళ అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేసినా అర్థమవ్వదు సరికదా వీడి అజ్ఞానాన్ని తీసుకొనివెళ్ళి జ్ఞాని యందు ఆరోపిస్తాడు. ఆత్మ పుస్తకాలలో లేదు, నీహృదయంలో ఉంది, కాబట్టి నీ హృదయంలో వెతికితే దొరుకుతుంది, పుస్తకాలలో వెతికితే దొరకదు అన్నారు భగవాన్. పుస్తకాలు మైలురాయి వంటివి భీమవరం ఇన్నిమైళ్ళుఅని మైలురాయి చెపుతుంది నీవు మైలురాయిని చూచినంత మాత్రాన భీమవరం వెళ్లలేవు అలాగే భగవంతుని గురించి చదివినంత మాత్రంచేత నీవు భగవంతుడిని పొందలేవు, నీవు సొంతంగా ప్రయాణం చేయాలి. నీవు ఏమి చేయాలి అంటే నీకంటే శక్తిమంతుడు, ఈసృష్టిని నియమించేవాడు సర్వజ్ఞుడు, అంతర్యామి అయిన ప్రభువు ఒకడు ఉన్నాడు అని పూర్తిగా విశ్వసించి వాడికి నీ మనస్సును వశంచేయాలి. అంతవరకే నీవు చేసే పని, మిగతాపని అంతా ఆయనే చూసుకొంటాడు కొంత వరకే నీవు ప్రయత్నం చేసేది తరువాత ప్రయత్నం చేయటానికి అంటూ ఎవడు మిగలడు, ఎప్పుడైతే ఆత్మ జ్ఞానం కలిగిందో ఈశ్వరుడు మీ శరీరాన్ని పనిముట్టుగా ఉపయోగించుకొంటాడు అప్పుడు మీ దేహం దేవాలయం అవుతుంది. మీరు పెద్ద పెద్ద దేవాలయాలు కట్టకపోయినా సాధన చేసి మీ దేహాన్ని దేవాలయం క్రింద చేసుకోవచ్చు మీరు దు:ఖం లేని స్థితికి ఎదిగివెళ్ళాలంటే మీకు

స్వంత సంకల్పం అంటూ ఏమీ ఉండకూడదు. ఈశ్వరుడిని సంకల్పమే మీ సంకల్పం, ఈశ్వరుడి ఇష్టమే మీ ఇష్టం చేసుకోవాలి. మీకు అర్థం అయినా, అర్థం కాకపోయినా ఫలానా సంవత్సరంలో, ఫలానా రోజున, ఫలానా గంటలో మీరు ఇక్కడ కూర్చొన్నారు అంటే మీ తల్లి కడుపులో నుండి మీ దేహం బయటకు వచ్చినప్పడే అదినిర్ణయింపబడింది, ఈవేళ మీరు కొత్తగా ప్లాను వేసుకొని రాలేదు, అది ఈశ్వరసంకల్పం. నేను అరుణాచలం వచ్చి కొత్తగా పొందినది ఏదీ లేదు, నా దేహప్రారబ్ధంలో ఇక్కడ ఉండవలసి ఉంది అంతే అన్నారు భగవాన్. దేహాన్ని ప్రారబ్దానికి విడిచి పెట్టండి, ప్రారబ్దం ప్రకారం దేహం నడుస్తుంది. మీరు ఆదేహంతోటి, ప్రారబ్దంతోటి తాదాప్యం పొందకండి, అటుచూడకండి, నాకు తెలియనిది ఏమీలేదు, నేను గొప్పవాడిని, నేనే తెలివైన వాడిని అనుకొంటే ఇంక నీవు ఈశ్వరుడికి శరణాగతి ఏమిపొందుతావు. నీకు భక్తుడుగా ఉండే అర్హత నాకు లేకపోతే, నీ భక్తుడికి భక్తుడిగా చెయ్యి అరుణాచలా అని భగవాన్ అక్షరమణమాలలో అంటారు. భగవంతుడి స్వరూపాన్ని ఎవడైతే పొందాడో వాడిచూపు చాలు మనకు జ్ఞానం కలగటానికి. మనం శివ, శివ అని నామం చేస్తున్నాము అనుకోండి శివుడు ఎంతటి వాడో, ఎంత శక్తి గలవాడో, ఎంత సర్వజ్ఞుడో ఆయన గొప్పతనం మనకు తెలియాలి అప్పడు మన మనస్సు అక్కడ నిలబడుతుంది. మన చుట్టాలందరికంటే భగవంతుడే మనకు పెద్ద చుట్టం ఆపెద్దచుట్టాన్ని మనం మర్చిపోయాము. ఎవడిని జ్ఞాపకం పెట్టుకోవాలో వాడిని మర్చిపోయాము ఈశరీరాలు అన్నీ నీడలు మనం భగవంతుడితో మానసిక అనుబంధం పెట్టుకోవాలి మన శరీరం ఎక్కడ ఉన్నా ఈశ్వరునితో మానసిక అనుబంధం పెట్టుకోండి మీరు ఏదో రకమైన సాధన చేయండి, అసలు మనస్సును లోపలకు పంపండి మనస్సును లోపలకు ఎలాపంపాలో ఆటెక్నిక్ మీకు తెలియాలి.

కర్మసిద్ధాతం గురించి పురాణాలలో ఒక కథఉంది. ఒక మనిషిని పాముకరిచింది అతను చనిపోయాడు ఒకడు ఆపామును పట్టుకొని ఆశవం దగ్గరకు తీసుకొని వచ్చాడు. పామును ఇక్కడ చంపుదామని తీసుకొని వచ్చాను అని చెప్పి పామును చంపడానికి సిద్దమయ్యాడు. అప్పడు ఆపాము అంది నన్ను ఎందుకు చంపుతున్నావు. నన్ను ఎవడో లోపల ప్రేరేపించాడు, నేనుకరిచాను. నాకు వాడికి విరోధం ఏమీలేదు. నాకు కరవటమేపనా? చెట్లుమీద పాకుతున్నాను చెట్లను కరుస్తున్నానా? నాకు అనేకమంది కనిపిస్తున్నారు, వారిని కరుస్తున్నానా? ఆటైముకు కరవాలనిపించింది, కరిచాను, వాడుచనిపోయాడు. లోపల ఎవడో, యమధర్మరాజో ఆజ్ఞాపించాడు కరిచానుఅంది.

20-10-2002

అప్పడు యమధర్మరాజును అడిగారు ఇంతమంది ఉన్నారుకదా వాడినే కరవమని ఎందుకు ప్రేరేపించావు అనిఅడిగారు. ఇందులో నాతప్ప ఏమీలేదు, ఇది కాలంయొక్క నిర్ణయం అనిచెప్పాడు అయితే కాలుడిని అడుగుదామని, ఎందుకు ఇలాచేసావు అని కాలుడిని అడిగారు. కాలుడు ఏమిచెప్పాడుఅంటే వీడిమీద నాకు అయిష్టం ఏమీలేదు, వీడుపూర్వజన్మలో చేసిన కర్మనుబట్టి ఫలానారోజున ఈపాముచేత కరవబడి చనిపోయే ప్రారబ్దంఉంది కాబట్టి చనిపోయాడు దానికి నేను ఏమిచేస్తాను అన్నాడు కాలుడు. వాడు పూర్వజన్మలో చేసిన దోషంవలన ఫలానా రోజున ఆపాముచేత చంపబడాలి అని నిర్ణయంవచ్చింది. అదికర్మసిద్ధాంతం. ఇప్పడు ఆటైముఅయ్యింది. మంచికర్మఅయినా, చెడుకర్మఅయినా ఫలితం రావటానికి కొంత టైముపడుతుంది. కాలప్రవాహంలో ఫలానారోజున పాముచేతకరవబడి చనిపోవాలి అని కర్మసిద్ధాంతం ప్రకారంనిర్ణయం అయిపోయిఉంది. అంతేగాని వాడిమీదనాకు ఏవిరోధంలేదు. అంటేవాడికర్మవాడిని చంపేసింది అంటేవాడు పూర్వజన్మలో చేసిన కర్మ ఈపరిస్థితిని తీసుకొనివచ్చింది. మాదోషం ఏమీలేదుఅంటూ కాలుడుతప్పకొన్నాడు, యముడు తప్పకొన్నాడు, పాము తప్పకొంది చివరకు ఎక్కడకు వచ్చిందిఅంటే వాడితప్పలకు వాడేకారణం అనిచెప్పారు. అందువలన మన విధికి మనమే కారణం. ఏదో పాముకారణం, అత్తగారు కారణం అనిఅనుకోవద్దు ఈమధ్య ఒక అత్తగారు అంది మాకోడలు తప్పఏమీలేదు. నాప్రారబ్దం ఆకోడలును మాఇంటికి తీసుకొచ్చింది. దేశంలో అనేకమంది స్త్రీలు ఉన్నారు, ఆవిడే మాకోడలుగా రావటం ఏమిటి? నాప్రారబ్దంప్రకారం ఆ అమ్మాయి మాకోడలుగా రావలసిఉంది, వచ్చింది. ఆ అమ్మాయి మంచిదా, చెడ్డదా అనేది అనవసరం ఆ అమ్మాయి మాకోడలుగా వచ్చిందికదా, ఆఅమ్మాయి నచ్చేటట్లుగా చేసుకోవాలి అదేసాధన అనిచెప్పింది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-11-02, ఆచంట

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉపాసన లేకుండా మోక్షంరాదు, జ్ఞానంరాదు. ఉపాసన అంటే మనం ఏదోఒక ఇష్టదేవతను తీసుకొని నిరంతరం మన మనస్సును వారి మీద కేంద్రీకృతం చేయటం వలన మన మనస్సు కరిగిపోయి అందులోలయమైపోతుంది. మీరందరూ సాధన పేరు మీద కష్టపడిపోవటంనాకిష్టంలేదు. మీరు ఫలితాలు ఆశించవద్దు, పరమేశ్వరుని మీద ప్రీతి పెంచుకోండి! ఆయన ఏదైనా ఇస్తేపుచ్చుకోండి, ఇవ్వకపోతే ఊరుకోండి కాని

అడగవద్దు. తేలికగా ఆత్మజ్ఞానం కలిగే ఉపాయాలు చెపుతున్నాను లోపల ప్రేమలేకుండా, లోపల శుద్ధి లేకుండా ఏదో బాహ్యప్రక్రియల వలన మనం ఈశ్వరుడిని మోసం చెయ్యలేము, ఆయన మన మనస్సును చూస్తూఉంటాడు. మన మనస్సుతో ఆయనను ఆరాధించగా ఆరాధించగా ఆయనకు మనకు అడ్డుగా ఉన్న మనస్సును ఆయనేతీసేస్తాడు. మీరు జీవితంలో ఒకటి నేర్చుకోండి. ఏపని చేసినా ఏదీ ఆశించవద్దు. వచ్చేది ఏదోవస్తుంది, రానిది ఏదోరాదు. ఆశించనంత మాత్రంచేత వచ్చేది ఆగదు. ఆశించినంత మాత్రాన ఎక్కువరాదు ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. ఈ ప్రకృతి, మాయ ఎప్పుడు విడిచిపెట్టాలో అప్పుడు విడిచిపెడతాయి, తొందరపడవద్దు, మోక్షంకూడా అడగవలసిన పనిలేదు. మనమనస్సు ఎప్పుడు పక్కానికి వస్తుందో చూసుకొని మన హృదయంలో ఉన్న భగవంతుడే మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. పని పనికోసమే చేయండి, మాట మాటకోసమే మాట్లాడండి, భగవంతుడిని మనం ప్రేమించటంలోనే మనకు ఆనందం వచ్చేయాలి, ఆయన ఇవ్వటంకాదు ఇది బాగా గుర్తుపెట్టుకోండి, భగవంతుడిని పూజిస్తున్నాము, జపిస్తున్నాము ఆయన మనకు ఏదైనా ఇస్తాడో లేదో అని ఇలా మన భక్తి వ్యాపారం క్రింద ఉండకూడదు, వ్యాపారభక్తి పనికిరాదు, ఆయన ఇచ్చే వస్తువులు అన్నీ కాలప్రవాహములో కొట్టుకొని పోతాయి. మనం భగవంతుడిని వదిలేస్తున్నాము ఆయన ఇచ్చే వస్తువుల కోసం ఎదురుచూస్తున్నాము. మన శరీరం ఎంతకాలం ఉంటుంది. ఆయన ఇచ్చే వస్తువులు ఎంతకాలం ఉంటాయి అన్నీ కాల ప్రవాహములో కొట్టుకొని పోతాయి. ఆయన ఇస్తాడో, ఇవ్వడో అది ఆయన ఇష్టం, మీరు ఏదీ కోరుకోవద్దు, అది భక్తిఅంటే. మీరు అడగటం వలన ప్రశ్నించటం వలన భక్తి చెడిపోతుంది, శరణాగతి చెడిపోతుంది. భక్తి భక్తి కోసమే, ప్రేమ ప్రేమకోసమే, అడగటం అనేది మానేయండి. అడిగే అలవాటు పెరుగుతూ ఉంటే మనస్సు బలపడిపోతుంది. అడిగే అలవాటు మనం మానివేశాము అనుకోండి, మనకు ఏది అవసరమో, మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు కాబట్టి మన అవసరాలు అన్నీ ఇచ్చి చివరకు మోక్షం కూడా ప్రసాదిస్తాడు కాని మన దురదృష్టం ఏమిటి అంటే అడగకపోతే ఆయన ఏమీ ఇవ్వడేమో అని తొందరపడి అడిగేస్తాము. ఇలా అడగటం వలన మనస్సు కలుషితం అవుతుంది. నేను మీ ఇంటికి వస్తే మీరు కాఫీ ఇస్తే తీసుకోవచ్చు కాని మీరు కాఫీ ఇస్తారని నేను మీ ఇంటికి రాకూడదు. మీరు కాఫీ ఇస్తారని అనుకొని నేను మీ ఇంటికి వస్తే దానివలన మనస్సు కలుషితం అవుతుంది. జపంచేసేటప్పుడే, ధ్యానంచేసేటప్పుడే మనకు ఆనందం వచ్చేయాలి మనం ఏదైనా పని చేస్తూ ఉంటే ఆపని చేసేటప్పుడే మనకు ఆనందం కలగాలి. ఫలితంకోసం ఎదురు చూడకుండా ఉంటే ఆశించకుండా ఉంటే అప్పుడు పని చేసేటప్పుడు మనకు ఆనందం కలుగుతుంది. పనికూడా దేవుడే, పనిచేసేటప్పుడు గుర్తింపులు లేకుండా చేయాలి. ఆత్మ గుర్తింపులు కోరదు, అహంకారం గుర్తింపులు కోరుతుంది. గుర్తింపులు కోరటం వలన అహంభావన పెరుగుతుంది. గుర్తింపుల వలన బాహ్యంగా మనం బాగుపడినట్లు కనబడినా మూలంలో నశిస్తాము. సొంత ఆలోచన విడిచిపెట్టవద్దు. సమాజంతో ఎటువంటి అనుబంధం ఉండాలి, ఎంతవరకు అనుబంధం ఉండాలి అనేది ముఖ్యం. చేసే స్నేహాల విషయంలో, చదివే పుస్తకాల విషయంలో, మాటలవిషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి.

భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నీ చేతిలో ఉన్న పనిని వదిలేస్తున్నావు, నా చేతిలో ఉన్న పనిగురించి అస్తమానూ ఆలోచిస్తున్నావు. దీనివలన కాలాన్ని పాడుచేసుకుంటున్నావు, శక్తిని వృధా చేసుకొంటున్నావు. నా చేతిలో ఉన్నపని ఎప్పుడు చేయాలి, ఎక్కడ చేయాలి, ఎలాచేయాలి, ఏజన్మలో ఆకర్మఫలంతోటి అనుసంధానం పెట్టాలి ఇవన్నీ నేను చూసుకొంటాను. నీ చేతిలో ఉన్నపని జాగ్రత్తగాచెయ్యి అని భగవంతుడు చెపుతున్నాడు. నాకు భయం వేసి ఏదైనా మాట్లాడుతున్నాను అనుకోండి, ఇక్కడ భయం అనే వాడు నాకు టీచర్‌గా ఉన్నాడు. కాని దైవం నాకు టీచర్‌గా లేడు. భయం వలన నేను మాట్లాడుతూ ఉంటే అది నాకూ మంచిదికాదు, మీకూ మంచిది కాదు. మనం నేను, నేను అనేది దేహగతమైన నేను మనం జీవించటమే ఆనేను కోసం జీవిస్తున్నాము. మనం అంతర్‌దృష్టితో పరిశీలనచేసి చూస్తే అహంభావన కోసమే జీవిస్తున్నాము అని మనకి తెలుస్తుంది. మన గురించి మనకు అంచనా ఉండాలి. మనలో ఏబలహీనతలు ఉన్నాయి, మనం ఎంత వరకు అభివృద్ధి లోనికి వస్తున్నాము అనే పరిశీలన ఉండాలి, గాఢ నిద్రలో మనకు అహంవృత్తి లేదు అందువలన మనకు దేనితోటి తాదాప్యంలేదు, కాని మనం ఉన్నాము. అహంవృత్తి ఉదయించిన తరువాత దేహంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి తాదాప్యం పొందుతుంది, ఇలా తాదాప్యం పొందిన తరువాత నేను ఇలా ఉన్నాను, నేను అలా ఉన్నాను అనుకొంటుంది. ఇలా ఉన్నాను, అలా ఉన్నాను అనుకోవటం వలన అహంభావన పెరుగుతుంది, దేహభావన పెరుగుతుంది. మీరు అలాగ లేరు, ఇలాగ లేరు మీరు ఆత్మగానే ఉన్నారు అని భగవాన్ చెప్పారు. మీరు అలాగ ఉన్నాను, ఇలాగ ఉన్నాను

అని అనుకొంటే సత్యాన్ని విడిచిపెట్టి అసత్యం వైపు ప్రయాణం చేస్తున్నట్లు, వెలుగును వదలి చీకటిలోనికి వెళ్తున్నట్లు గుర్తు. గాఢనిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి వచ్చేటప్పటికి సముద్రంలో బుడగలాగ నేను అనే తలంపు వస్తుంది. దానిని మనం పోగొట్టుకోవాలి. నేను అనే తలంపు పోతే మనం పోతాము అని అనుకొంటాము కాని మనంపోము బుడగపోతే అది సముద్రంలో ఎలాగ కలిసిపోతుందో అలాగ నేను అనే తలంపు పోతే మనం పోము, ఆత్మ అవుతాము. జాగ్రదవస్థలో మనం పనిచేసుకొంటాము, గాఢనిద్రలో మనం విశ్రాంతి తీసుకొంటాము, స్వప్నావస్థ ఎందుకు పనికిరానిది అనుకొంటాము కాని స్వప్నావస్థ మనకు గురువే. స్వప్నావస్థలో మనలోని బలహీనతలు మనకు తెలుస్తాయి అందుచేతనే భగవంతుడు స్వప్నావస్థను పెట్టాడు. శ్మశానానికి వెళ్ళేవరకు ఎంతసేపు మనకు రెండే పనులు 1) దేహంతో తాదాప్యం 2) మనస్సుతో తాదాప్యం ఇవితప్ప ఇంకో పని మనకులేదు. ఈదేహము, మనస్సు రెండూ నిజంకాదు వీటితోనే తిరుగుతూ ఉంటే ఇంక మనకు సత్యం ఎలా తెలుస్తుంది. మీకు దేహంతో తాదాప్యం లేకపోతే అది పుట్టిన ఏమీ అనిపించదు, అదిచనిపోయినా ఏమీ అనిపించదు. మీకు మనస్సుతో తాదాప్యం లేకపోతే ఎవరైనా పొగిడినా మీకు ఏమీ అనిపించదు, ఎవరైనా విమర్శించినా ఏమీ అనిపించదు. గాఢనిద్ర మనకు గొప్ప గురువు. ఎందుచేతనంటే గాఢనిద్రలో మనం కానిదానిలో నుండి విడిపోతున్నాము, అక్కడ మనం మనంగా ఉంటున్నాము. మీరు భగవంతుడిని ఎలా స్మరించుకొంటున్నారో అలాగ ఎప్పుడైనా గాఢనిద్రని స్మరించుకోండి. నీ హృదయంలో ఒక నేను ఉంది, అది దేనితోను తాదాప్యం పొందదు. అదిచేసాను, ఇది చేసాను అని ఏనేను అయితే అనుకొంటోందో ఆనేనును పోగొట్టుకోవటానికి శాస్త్రం సహకరిస్తుంది. మీ లోపల ఒక శుద్ధమైన, నిర్మలమైన నేను ఉంది, అది మీ కోసం ఎదురుచూస్తోంది అది ఎప్పుడూ ఉంటుంది, ఉండటమే దానిపని. నువ్వు కానిదానిలో నుండి విడుదల పొందేవరకు ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తంకాదు. అది పరిశుద్ధంగా ఉంది, పరమపవిత్రంగా ఉంది, నిశ్చలంగా ఉంది దానికి ఆదిలేదు, మధ్యలేదు, అంతంలేదు అది నీవై ఉన్నావు అక్కడకు వెళ్ళటానికి గురువు నీకు సహాయ సహకారములు అందిస్తాడు, దానికి సహకరించకపోతే వాడు గురువు కాదు, వాడు రాక్షసుడు.

మనకు మంచితలంపులు, చెడుతలంపులు అనేకం వస్తూఉంటాయి. ఇవిఅన్నీ దేనికి వస్తున్నాయి. ఇవి అన్నీ నేను అనే మొదటి తలంపుకే వస్తున్నాయి. అదికూడా ఒక తలంపే, సంతోషం, దుఃఖం, వికారములు, జీవితం అంతా తలంపులే, నీలోపలఉన్న సత్యం తప్పించి మిగతావి అన్నీ చావుపుట్టుకలతోసహా, నీకష్టసుఖాలతో సహా అన్నీ మనస్సు కల్పించిన విషయములే ఇది నీవు తెలుసుకోవాలి. అసలు మనస్సు నీవు కాదు అంటారు భగవాన్. మనస్సే నీవు అయితే మరి గాఢనిద్రలో మనస్సుతో ఎందుకు వేరువడి పోతున్నావు. అంటే మనస్సు నీవుకాదు నీవుకాని మనస్సు చుట్టూ తిరగటం వలన నువ్వు మనస్సు అవ్వవు, అందువలన మనస్సు గొడవ వదిలెయ్యి. నేను అనే మొదటి తలంపును, మూలతలంపును మాట మాటకు ఉద్రేకపరచవద్దు, దానికి వికారములు రానివ్వకు, దానిని మచ్చిక చేసుకొని దానిమూలంలోనికి తీసుకొని వెళ్ళు. దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది, అప్పుడు నీలోపల ఉన్నపరమాత్మ నీకు తానుగా వ్యక్తమవుతాడు, అది పరమస్థితి, అప్పుడు ఎటు చూసినా ఆనందమే. అసలు మనస్సే లేదు అని భగవాన్ చెపుతున్నారు మరి మీకు మనస్సు ఉందా అని ఒకరు అడుగుతున్నారు. నాకు మనస్సు పోలేదు, ఉంది అది సాత్వికమనస్సు. దీనిని ఇంకా శుద్ధంచేస్తే, పరమ పవిత్రం చేస్తే అది ఆత్మగా రూపాంతరం చెందుతుంది. పరమపవిత్రమైన మనస్సు చూస్తుంది, అది చూసినా విషయాలతో కట్టుబడదు. పరమపవిత్రమైన మనస్సు ఎటువంటిది అని చెపుతారు అంటే కాలిపోయిన తాడు వంటిది. కాలిపోయిన తరువాత తాడు, తాడులాగానే కనబడుతుంది కాని అది కట్టటానికి పనికిరాదు అలాగే జ్ఞాని మనస్సుకూడా అంతే, సాత్వికమనస్సు, చైతన్యానికి దారి చూపించి అది తప్పకొంటుంది. సాధన ఎంతకాలం చేయాలి అని అడుగుతున్నారు. సాధన చేసేవాడు నీలోపల ఉన్నంతకాలం సాధన చేయవలసిందే, ప్రతిజన్మలోను చేస్తూనే ఉండాలి ఆచేసేవాడు పోయేంతవరకు సాధన చేస్తూనే ఉండాలి. సాధన చేసేవాడు నశిస్తే నీ సాధన పూర్తి అయినట్లే, మిమ్మల్ని చూడటానికి చాలమంది వస్తున్నారు, ఎందుకు వస్తున్నారు అని ప్రశ్న. ఆప్రశ్న నన్ను అడగవద్దు, చూడటానికి వచ్చిన వారిని అడగండి అని చెప్పాను. మూలతలంపును దాని మూలంలోనికి తీసుకొని వెళ్లమని మీరు చెపుతున్నారు ఇంత కంటే నిరంతరం భగవంతుడిని స్మరించుకోవటం మంచిది కదా అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. రామ, కృష్ణ, శివాఅని భగవంతుడి నామాన్ని స్మరించుకోవటం విచారణామార్గంకంటే ఉత్తమమైనది ఏమో అని అడుగుతున్నాడు భగవంతుని నామాన్ని స్మరించుకోవటంలో ఒక సంతృప్తి ఉంటుంది, నేను నేను అంటే ఏమీ సంతృప్తి కనబడటం లేదు, గాలిలో దీపం పెట్టినట్లు ఉంది, భగవంతుని స్మరించుకొంటూ ఉంటే ఒక ఆలంబన

ఉంటుంది అంటున్నాడు దీనికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నువ్వు ఏదోపద్ధతిలో వెడతానంటున్నావు. శివుడిని ప్రార్ధించుకొంటాను అంటున్నావు అక్కడే వేరుభావన ప్రారంభమయ్యింది శివుడిని స్మరించుకో కాని శివుడు వేరు, నేనువేరు అని సద్వస్తువును రెండు ముక్కలు చేసేసావు. వేరుభావన లేకుండా పనిచేస్తే నీవుపనిచేసినా చెయ్యని వాడితో సమానము. వేరుభావనలో నుండే నీకు భయం కలుగుతుంది, కోరిక వస్తుంది ద్వేషంవస్తుంది. నీకువేరుభావన ఉన్నప్పుడు శివుడిని స్మరించుకో నేను వద్దనటంలేదు. శివుడు వేరు, నువ్వువేరు అని సెపరేట్‌నెస్ నీకు వచ్చేసింది, అది నీవు గుర్తుపెట్టుకో, అలాఅని శివుడిని ఆరాధించవద్దు అనికాదు. నీమార్గంలో నీవు ప్రయాణం చెయ్యి నీకు నిజం తెలియకపోయినా ఏ శివుడినయితే ఆరాధిస్తున్నావో ఆయనకు నిజం తెలుసు. ఏదోజన్మలో నిజం దగ్గరకు ఆయన నిన్ను తీసుకొని వెళతాడు, అప్పటి వరకు నిన్ను విడిచిపెట్టడు. ఏది తెలిసిన తరువాత నీవు దుఃఖరహితుడవు, భయరహితుడవు, జన్మరహితుడవు అవుతావో ఆస్థితి ఏమిటో నీకు తెలియకపోయినా నీవు ఆరాధించే శివుడికి తెలుసు కాబట్టి ఆస్థితి నీకు తెలిసేవరకూ ఆయన నిన్ను వెంటాడుతూనే ఉంటాడు. అవసరమైతే మానవరూపం ధరించి, ఈ శరీరం అనే చొక్కా వేసుకొని, నీకు బోధించటం కోసం వస్తాడు ఆయనే శివుడు. మనం విష్ణువుని అలంకరించినా, శివుడిని అభిషేకించినా, కుమారస్వామిని దర్శించినా మనకోసమే మనం చేసుకొంటున్నాము, మనం పవిత్రులం అవ్వటం కోసమే చేస్తున్నాము. శివుడిని ఆరాధించటం మాట అటుఉంచండి, మీరు వేదంలో చెప్పిన మాటలు చెప్పటం లేదు అని అడుగుతున్నారు. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే అహంబ్రహ్మాస్మి నేను బ్రహ్మమునై ఉన్నాను అని వేదంలో చెప్పిన మాట నిజమే. నేను బ్రహ్మమునై ఉన్నాను అని అనుకొనే వాడు ఎవడు? బ్రహ్మమునేను అని అనదు, నేను బ్రహ్మమును అనుకొనే ఈ నేను ఎవరు? అదికూడా ఒక తలంపే, దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు. ఇటునుండి అటుచెప్పినా, అటునుండి ఇటుచెప్పినా ఉన్నది ఒక్కటే.

నీకు ఒక రూపంఉంది ఆ రూపం మటుకు నీవు కాదు, నీకు ఒక శరీరం ఉంది ఆశరీరం మటుకు నీవు కాదు, నీకు ఒక మనస్సు ఉంది ఆమనస్సు నువ్వుకాదు, నీకు ఒక ఇల్లు ఉంది ఆఇల్లు మటుకు నీవు కాదు, నీకు ఒక గ్రామం ఉంది ఆ గ్రామం నీవు కాదు, నీకు ఒక పేరు ఉంది ఆపేరు మటుకు నీవుకాదు, ఇవి ఏమీ నీవు కాదు నువ్వు ఏదిగా ఉన్నావో దానిమీద నీమనస్సును నిలబెట్టటమే నిజమైన సాధన మిగిలినవి అన్నీ సాధనలలాగ కనిపించే సాధనలు. వాటి వలన పుట్టమీద దెబ్బలు తగులుతాయి కాని పుట్టలో ఉన్న పాము మీద దెబ్బలు తగలవు. పుట్టను కొట్టటం వలన పాము చనిపోదు, పుట్టలో ఉన్నపామును కొట్టటం వలన మాత్రమే పాము చనిపోతుంది. ఉన్నది ఒక్కటే, ఒక్కటి అంటే ఒక్కటే, నీమనస్సును అక్కడ నిలబెట్టు. అక్కడ నిలబెడితే కొంతకాలానికి మనస్సును ఎక్కడయితే నిలబెడుతున్నావో అది నువ్వు అన్న సంగతి నీకు తెలుస్తుంది, మనస్సు నశించిన తరువాత అది నీకు తెలుస్తుంది. నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక అనుభవం పొందటానికి నీవు చేతులతో పనిచేసుకో, మనస్సులో నిర్మలంగా ఉండు, నిశ్చలంగా ఉండు, నిరాడంబరంగా ఉండు, ఏకంగా ఉండు, శాంతిగా ఉండు. భక్తి పేరు చెప్పి నిర్మలంగా, నిశ్చలంగా ఉండాలి గాని ఆడంబరంగా, ఆందోళనగా ఉండకూడదు. చూపులో నిర్మలత్వం, మాటలో నిర్మలత్వం, మనస్సులో నిర్మలత్వం ఉండాలి. మీపని మీరు శ్రద్దగా చేసుకోండి, పని విడిచిపెట్టి పారిపోవద్దు. మీ ప్రారబ్దమును బట్టి మీకు పరిస్థితులు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు. మీరు మాత్రం భగవంతుడిమీద భారంవేసి మీపని ఏదో మీరు జాగ్రత్తగా చేసుకొంటూ, సోమరితనానికి అలవాటు పడకుండా నిర్మలంగా ఉండి, నిశ్చలంగాఉండి మీ హృదయంలో ఏదో ఉంది అంటున్నారు కదా అది ఎవరోకాదు అది మీరే అన్నసంగతి అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నంచెయ్యండి.

20-10-2002

రమణ భాస్కర

20-10-2002 రమణ భాస్కర

20-10-2002 రమణ భాస్కర

20-10-2002

రమణ భాస్కర